
సాక్షి గుంటూరు
శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



57 వేల క్యూసెక్కులు విడుదల

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 57,456 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ నుంచి 30,401 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



కేంద్ర మంత్రికి స్వాగతం

విమానాశ్రయం(గన్నవరం): వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు విచ్చేసిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు విమానాశ్రయంలో నాయకులు, అధికారులు స్వాగతం పలికారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 587.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 8,529 క్యూసెక్కులు వదిలారు.

పూర్తిగా దెబ్బతిన్న పంటలు



ఈ ఏడాది కురిసిన వర్షాలకు పత్తి, అపరాల పంటలు పూర్తిగా నీట మునిగి తీవ్రంగా నష్టపోయాం. 10 ఎకరాల పత్తి పంట వేసి మంచి ఎదుగుదల దశలో ఉన్నప్పుడు వరదలకు నేలవాలి ఎండిపోయింది. ఎకరాకు రూ.40 వేలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి పరిహారం ఇవ్వాలి. రాయితీపై విత్తనాలు, ఎరువులు అందజేయాలి.

– పరుచూరి నారాయణ, రైతు, పాములపాడు

కౌలు రైతులను ఆదుకోవాలి



ప్రభుత్వం పరిహారంతో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు ఇస్తేనే కౌలు రైతులకు ఊరట కలుగుతుంది. నష్టం అంచనాలు రూపొందించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ వర్షాలకు కొద్దిపాటి సాగు చేసే పేద రైతులు తీవ్రంగా నష్టపోయారు.

– ఇనుకపల్లి రమేష్, రైతు, తాడికొండ

రూ. 50 వేలు ఇవ్వాలి



గత 20 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా అన్నదాతలకు నష్టం వాటిల్లింది. తిరిగి కోలుకొని సాగు చేయాలంటే ఎకరాకు మెట్ట పంటలకు రూ.50 వేలు, వాణిజ్య పంటలకు రూ.లక్ష పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. లేదంటే రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉంది.

– బ్రహ్మారెడ్డి, రైతు, తాడికొండ

రాకపోకలు బంద్



వరదలొచ్చిన ప్రతిసారి ప్రత్తిపాడు - గొట్టిపాడు మధ్యనున్న లో లెవల్ చప్టాపై నక్క వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ప్రవాహం తగ్గే వరకు గుంటూరు, పల్నాడు జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మించాలి.

– మన్నవ మహేంద్ర, పెదగొట్టిపాడు

18 ఎకరాల్లో నష్టం



11 ఎకరాల్లో పత్తి, 7 ఎకరాల్లో మిర్చి సాగు చేశా. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు మొత్తం పంట నీట మునిగింది. మొక్కలు వాలిపోయాయి. పంట ఏ మాత్రం పనికి వచ్చేలా లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. పరిహారం అందజేసి నాలాంటి రైతులను ఆదుకోవాలి.

– విప్పల రాజశేఖర్‌రెడ్డి, రైతు, పీసపాడు, క్రోసూరు మండలం

ఎరువులు, విత్తనాలు ఇవ్వాలి



మా సొంత పొలంతోపాటు సుమారు 40 ఎకరాలకు పైగా కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశా. వానలు, వాగులు, కృష్ణా నది వరద వల్ల 40 ఎకరాలలో పత్తి పంట పూర్తిగా ధ్వంసమైంది. ఇంత వరకు ప్రభుత్వం పరిహారం విషయంలో ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. పరిహారం ఇచ్చేటప్పుడు కౌలు రైతులు నష్టపోకుండా నిర్ణయం తీసుకోవాలి. మరో పంట సాగుకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలి.

– ఆలా లక్ష్మీనారాయణ, గోపాల్ నగర్, అమరావతి

ఇల్లు, పంటలు మునిగాయి



కృష్ణా నది వరదలతో పంటలు మునిగి పోయి తీవ్రంగా నష్టపోయాను. నీరు రావడంతో ఇల్లు కూడా దెబ్బతింది. ప్రభుత్వం పంటలతో పాటు దెబ్బతిన్న ఇళ్లకు కూడా నష్ట పరిహారం చెల్లించాలి. కానీ పంట నష్టపరిహారం మాత్రమే ఇస్తామని చెబుతోంది. దెబ్బ తిన్న ఇళ్లకు కూడా ఇచ్చి మాలాంటి వారిని ఆదుకోవాలి.

–జి సురేష్, పెసర్లంక, కొల్లూరు మండలం

రుణాలు రద్దు చేయాలి



వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులు, కౌలు చేసేవారు, పాడి రైతులకు రుణాలు రద్దు చేయాలి. వరద వల్ల పంటలు నష్టపోవడంతో పనుల్లేవు. కొత్త రుణాలివ్వాలి. లంక గ్రామాల్లో డ్వాక్రా గ్రూపులకు కూడా రుణాలు రద్దు చేసి, కొత్తవి ఇవ్వాలి.

–టి.సురేష్, చింతర్లంక, కొల్లూరు మండలం

లో లెవల్‌పై హై టెన్షన్

లో లెవల్ చప్టాలతో వర్షాకాలంలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వర్షం కురిసిన ప్రతిసారి వారి బాధలు అన్నీ ఇన్నీ కావు. లో లెవల్ చప్టాలపై వరద ఉధృతితో రెండు మండలాలే కాదు.. రెండు జిల్లాల మధ్య రాకపోకలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పాలకులు ఇకనైనా స్పందించి వీటి స్థానంలో వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



వర్షాలకు ప్రత్తిపాడు - గొట్టిపాడు మధ్య లో లెవల్ చప్టాపై ఉప్పొంగుతున్న నక్కల వాగు

- భారీ వానలు కురిసిన ప్రతిసారి సమస్య తీవ్రం
- ప్రకాశం, పల్నాడు జిల్లాలకూ రాకపోకలు బంద్
- పరిష్కారంపై దృష్టి పెట్టని పాలకులు

ప్రత్తిపాడు: ఏళ్లుగా ఎప్పుడు భారీ వానలు పడినా పలు చోట్ల లో లెవల్ వంతెనల వద్ద ప్రజలకు నానా అగచాట్లు తప్పడం లేదు. ప్రధానంగా కింది ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉంటోంది.

- ప్రత్తిపాడు మండలం గుంటూరు నుంచి పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై బొర్రావారి పాలెం సమీపంలోని లో లెవల్ చప్టాపై కొండ వాగు ఉప్పొంగితే ఇక్కడి ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గుంటూరు నుంచి ప్రకాశం జిల్లా పర్చూరుకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- ప్రత్తిపాడు నుంచి పెదగొట్టిపాడుకు వెళ్లే దారిలో ఉన్న లో లెవల్ చప్టాపై నక్కల వాగు ఉప్పొంగుతోంది. దీంతో ప్రత్తిపాడు - పల్నాడు జిల్లా యడ్లపాడు మండలాల మధ్య రాకపోకలు లేవు.
- చినకోండ్రుపాడు - నడింపాలెం దారిలో ఉన్న లో లెవల్ చప్టాపై రామ వాగు పొంగుతుండటంతో 16వ నంబరు జాతీయ రహదారికి వెళ్లే మార్గానికి దారులు మూసుకుపోతున్నాయి.



చినకోండ్రుపాడు - నడింపాలెం మధ్య లో లెవల్ చప్టాపై రామ వాగు, కొండ వాగుల ఉధృతి

- ప్రత్తిపాడు నుంచి పెదనందిపాడు వెళ్లే దారిలో స్థానిక జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న లో లెవల్ చప్టాపై వరద తీవ్రరూపం దాల్చడంతో గుంటూరు జిల్లాలోని సుమారు ఇరవై గ్రామాలకు, ప్రకాశం జిల్లాలోని చిన్న నందిపాడు, అడుసుమల్లి, పర్చూరు మధ్య రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.
- పెదగొట్టిపాడు నుంచి ఉన్నవ మధ్య ఉన్న వాగు వల్ల కూడా పల్నాడు జిల్లా ఉన్నవ, యడ్లపాడు మధ్య హైవేకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- గొట్టిపాడు నుంచి కొప్పర్రు మధ్య ఉన్న వాగు పొంగినా అంతే. భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగడం, జనం తీవ్ర ఇబ్బందులు పడటం సర్వ సాధారణమైంది. లో లెవల్ చప్టాలపై వరద ఉధృతి తగ్గేవరకు వాహనాలు అటూ ఇటూ వెళ్లలేని స్థితి చోటుచేసుకుంటోంది.

జిల్లాలో పలు చోట్ల భారీ వర్షాలు

కొరిటెపాడు(గుంటూరు): అల్పపీడనం వల్ల గుంటూరు జిల్లావ్యాప్తంగా పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. మిగతా ప్రాంతాల్లో మోస్తరుగా పడుతున్నాయి. జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 50.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా పెదనందిపాడు మండలంలో 1.2 మి.మీ. పడింది. సగటున 14.7 మి.మీ.గా నమోదైంది. తాడేపల్లి మండలంలో 39.6, మంగళగిరి – 33.4, కొల్లిపర – 30.4, తాడికొండ – 24.2, ప్రత్తిపాడు – 19.2, తుళ్లూరు – 10.6, పెదకాకాని – 9.2, తెనాలి – 9.2, చేబ్రోలు – 7.4, గుంటూరు తూర్పు – 5.4, పొన్నూరు – 5.2, మేడికొండూరు – 5, గుంటూరు పశ్చిమ – 5, ఫిరంగిపురం – 3.4, వట్టిచెరుకూరు – 3.4, కాకుమాను మండలంలో 2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గురువారం వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 22.3 మి.మీ. కాగా, ఇప్పటి వరకు 186 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజులపాటు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు.



ఉండవల్లి - పెనుమాక మధ్యలో అరటి తోటలో నిలిచిన వరద నీరు

నీటిలోనే పంటలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో వర్షాలు, వరదతో పంట పొలాలు గురువారం కూడా నీటిలో ఉన్నాయి. నీరు వెళ్లే మార్గం లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా వరి, వాణిజ్య పంటలైన పసుపు, కంద, అరటి తదితర పంటలు వేశారు. వరద కాస్త తగ్గుముఖం పట్టినా లోతట్టు పంట పొలాల్లో నీరు బయటకు వెళ్లలేదు. మెల్లెంపూడి, నూతక్కి, ఉండవల్లి, పెనుమాక, రామచంద్రాపురం, కొండూరు, చినపాలెం, పెదపాలెం, వీర్లపాలెం గ్రామాల్లో ఇప్పటికీ వరద నీరు ప్రవహిస్తూనే ఉంది. వాణిజ్య పంటలు నీటిలో ఉంటే వేరుకుళ్లుతోపాటు చిగురు ఎండిపోవడం లాంటి సమస్యలు కూడా తలెత్తుతాయని, దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండవీటి వాగులో వరద తగ్గుముఖం

తాడికొండ: వర్షాల కారణంగా పొంగిన కొండవీటి వాగులో వరద ఉధృతి ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతోంది. పలుచోట్ల గండ్లు పడటంతో పంట పొలాలపై వరద విరుచుకుపడింది. అన్నదాతలు రోడ్డున పడ్డారు. తాడికొండ మండలంలోని తాడికొండ, కంతేరు, పొన్నెకల్లు, నిడుముక్కల, గరికపాడు, ఫణిదరం, దామరపల్లి, తుళ్లూరు మండలంలోని పెదపరిమి, వడ్డమాను, నెక్కల్లు, అనంతవరం, గుంటూరు రూరల్ మండలంలోని నీరుకొండ, కృష్ణాయపాలెం, నిడమర్రు తదితర గ్రామాల్లో వేల ఎకరాల పంటలు నీట మునిగాయి. తాడికొండ– కంతేరు రహదారి పూర్తిగా ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయి. నాగార్జున వర్సిటీకి వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులతోపాటు మంగళగిరి, విజయవాడకు రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి.

సామగ్రి నాశనం



మూడు సంవత్సరాల క్రితం దుకాణం అద్దెకు తీసుకుని ఎలక్ట్రిక్ సామాన్ల రిపేర్ షాపు ఏర్పాటు చేసుకున్నా. రిపేర్ కోసం వచ్చిన వాటితో పాటు విక్రయానికి ఉంచిన సామగ్రి కూడా పూర్తిగా నీటిపాలైంది.

- ఎస్‌కే రఫీ

ఎలా బతకాలో..



ఇద్దరు కుమారులు, కుమార్తెకు పెళ్లి చేశా. వేరు కాపురాలు పెట్టారు. అందరివి అద్దె ఇళ్లే. అన్ని నీట మునిగాయి. ఎలా బతకాలో అర్థం కావడం లేదు. సామగ్రి అంతా పాడయ్యాయి. మళ్లీ సమకూర్చుకోవాలంటే అప్పులు చేయక తప్పదు.

- ఎస్‌కే షాహిదా బేగం

వస్తువులన్నీ ఇంట్లోనే..



నేను హాస్పిటల్‌లో హౌస్ కీపింగ్ పని చేస్తున్నా. నైట్ డ్యూటీకి వెళ్లాను. పొద్దున్నే వచ్చేసరికి ఇంట్లో 8 అడుగుల మేర నీళ్లు ఉన్నాయి. వస్తువులన్నీ పాడైపోయాయి. ఇప్పుడు ఆ వస్తువులు కొనుక్కోవాలంటే రూ.లక్ష కావాల్సిందే.

- పేరసాని కోటేశ్వరి

కృష్ణమ్మ మిగిల్చిన మహా కష్టం..!

- ఆర్థికంగా దెబ్బతిన్న దాదాపు 3,500 కుటుంబాలు
- కుటుంబానికి రూ.75 వేలు నుంచి రూ.2 లక్షల వరకు నష్టం
- కోలుకోలేని దీనస్థితిలో మహానాడు వాసులు

వారందరూ పొట్టకూటి కోసం సొంత ఊళ్లు వదిలి కృష్ణా తీరంలో స్థిరపడ్డారు. ఇక్కడ జీవనం సాగిస్తూ ఇప్పటి వరకు ఒక్కొక్కటిగా వస్తువులు కూడబెట్టుకుని ఇల్లు చక్కదిద్దుకుంటున్నారు. వారిని కృష్ణా నది వరద రూపంలో కష్టాలు ముంచెత్తాయి. నివాసాల్లోని వస్తువులన్నీ వరద దెబ్బకు పనికిరాకుండా పోయాయి. ఇదీ.. మహానాడు వాసుల కన్నీటి వ్యథ. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

తాడేపల్లి రూరల్ : మహానాడు, విజయవాడ కనకదుర్గ వారధి రేపల్లె రోడ్డులో కరకట్ట లోపల ఉన్న నివాసాల్లో ఒక్కొక్క ఇంట్లో దాదాపు ఆరు అడుగుల మేర వరద నీరు వచ్చింది. దీంతో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ నీటిపాలు అయ్యాయి. గత 45 సంవత్సరాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, త్రిపురాంతకంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారెందరో ఇక్కడ ఉంటున్నారు. పొట్ట కూటి కోసం కృష్ణాతీరంలో అసైన్‌మెంట్ భూములను కొనుగోలు చేసి నివాసాలు ఏర్పరచుకున్నారు. ఈ ప్రాంతంలో అధికారిక లెక్కల ప్రకారం ఇంటి పన్ను కట్టేవారు 2,500 మంది ఉన్నారు. ఈ నివాసాల్లో సుమారు 3,500 వరకు కుటుంబాలు ఉంటున్నాయి. మరికొందరు అద్దె ఇళ్లలో ఉంటున్నారు. వీరందరూ చిన్న పనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇంట్లోని వస్తువులను వారానికి కొంత డబ్బు చెల్లించి సమకూర్చుకున్నారు. ఇవన్నీ వరద నీటిలో మునిగి పాడైపోయాయి. ఒక్కో కుటుంబానికి రూ. 75 వేల నుంచి రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న వ్యాపారం చేసుకునే వారైతే దుకాణాల్లోని వస్తువులు నీటిపాలు కావడంతో పెట్టుబడి లేక దీనస్థితిలో ఉన్నారు.



తడిచిన సామగ్రితో యువకుడి పాట్లు



సర్టిఫికెట్లను ఆరబెట్టుకుంటున్న విద్యార్థిని

ఒక్కరి సంపాదనతోనే..



కనిగిరి నుండి 30 ఏళ్ల క్రితం పొట్టకూటి కోసం వచ్చాం. తరువాత నా భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. అద్దె ఇంట్లో ఉంటున్నాం. కుమారుడు మహేంద్ర చిన్న షాపులో పనిచేస్తాడు. 3,500 ఇంటి అద్దె కట్టాలి. కుమార్తె ఉంది. వరదల వల్ల ఇంట్లో వస్తువులన్నీ పాడైపోయాయి. ఒక్కరి సంపాదనతోనే బతికే మా పరిస్థితి ఇప్పుడేంటో అర్థం కావడం లేదు.

- గాజుల గురవమ్మ

ఎన్నడూ చూడలేదు



నేను ఇక్కడికి వచ్చి 40 ఏళ్లు. వరద మూడుసార్లు ఉధృతంగా వచ్చింది. కానీ ఈ స్థాయిలో ఎప్పుడూ చూడలేదు. ఇంటి గోడలు కూడా పడిపోయాయి. హోటల్ నిర్వహిస్తున్నా. సామగ్రి అంతా పాడైంది. వ్యాపారం ఎలా చేసుకోవాలో తెలియడం లేదు.

- కలిమి నాగమేలేటి

ఒక్కటీ పనికి రాదు



వరద వచ్చే సమయంలో ఇంట్లో పురుషులు ఎవరూ లేరు. అప్పటికీ ఫ్రిజ్, టీవీ, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు మంచం పై పెట్టి, మంచం కోళ్ల కింద రాళ్లు పెట్టాను. అయినా సరే మంచం మీదకు నీళ్లు వచ్చి వస్తువులన్నీ పాడైపోయాయి. సామగ్రి బురదమయం అయింది. ఒక్కటీ పనికొచ్చే పరిస్థితి లేదు.

- అడుసుమల్లి పద్మ

ఉపాధ్యాయ వృత్తి దేవుడిచ్చిన వరం

జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు వెస్ట్: పిల్లల్ని అన్నివిధాలా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఈ వృత్తి దేవుడిచ్చిన వరమని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా క్రిస్టినా మాట్లాడారు. ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, జిల్లా విద్యాశాఖాధికారి శైలజ, డిప్యూటీ మేయర్ షేక్ షజిల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందించి, ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

సత్కారం అందుకున్న ఉపాధ్యాయులు వీరే...

షేక్ షఫీఉల్లా (స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్ కొర్నెపాడు), బి.సునీత రజిని (స్కూల్ అసిస్టెంట్, ఎస్ఎస్ఎన్‌ఓ గవర్నమెంట్ హైస్కూల్, బ్రాడీపేట, గుంటూరు), అబ్దుల్ షాజీర్ (స్కూల్ అసిస్టెంట్, ఎంపీయూపీఎస్, ఉర్దూ, నులకపేట), ఎ.కోటేశ్వరరావు (స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్, మందడం), బి.నాగకృష్ణకుమారి (స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్, బోయ్స్, దుగ్గిరాల), బి.రమేష్‌బాబు (స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్, పెనుమాక), టి. సుబ్బారావు (ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ పేరేచర్ల), కె.భాస్కరరావు (ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ చింతలపూడి), షాహిద్ అలీ షేక్ (స్కూల్ అసిస్టెంట్, ఎంపీయూటీఎస్, ఉర్దూ, నులకపేట), జోసఫ్ సుధీర్‌బాబు (స్కూల్ అసిస్టెంట్, జెడ్పీటీఎస్. చినకొండ్రుపాడు), షేక్ అనిలా సుల్తానా (స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్, నిడమర్రు), వి.శ్రీరామప్రసాద్ (ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, ఎంపీపీఎస్, కాకుమాను), ఎ.పద్మ (స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్, గర్ల్స్, దుగ్గిరాల), షహనాజ్ బేగం (ఎస్‌జీటీ ఉర్దూ, ఎంపీఎల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రైమరీ స్కూల్, సంగడిగుంట, గుంటూరు).